# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. అమరావతి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
2. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవంతో రాజధాని అమరావతి ఆధ్యాత్మిక నగరంగా మారనుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.
3. రాష్ట్రంలో మహిళల భద్రతకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యమిస్తోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా వెల్లడించారు.
4. ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం కీలక సంస్కరణలు ప్రవేశపెడుతోందని ఇంటర్మీడియట్ విద్యా మండలి తెలిపింది.
5. రాష్ట్రంలో పాఠశాలలకు రేపటి నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు.

==========================

అమరావతి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, ఆలయ పవిత్రతను కాపాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం మేరకు అమరావతి నిర్మాణం కొనసాగుతోందని మంత్రి తెలియజేస్తూ....

...వాయిస్ ..25 సెకన్లు....

---------------------------

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవంతో రాజధాని అమరావతి ఆధ్యాత్మిక నగరంగా మారనుందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతిలోని వెంకటపాలెం గ్రామంలో ఉన్న శ్రీ వేంటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో రేపు జరగనున్న స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పి.నారాయణ, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుతో కలిసి దేవాదాయశాఖ మంత్రి పరిశీలించారు. అనంతరం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ...

...వాయిస్.. 26 సెకన్లు...

---------------------------

హెూలీ పండుగ ప్రజల్లో ఐక్యతను చాటి చెబుతుందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ అన్నారు. విజయవాడ లో జరిగిన హెూలీ పండుగ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశ ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హెూలీ పండుగ స్నేహం, ప్రేమ, ఆనందం పంచుకునే పండుగ అన్నారు. హెూలీ పండుగ కేవలం రంగుల వేడుక మాత్రమే కాదని, ఇది ఐక్యత, భక్తి, ఆనందం, కలిసికట్టుగా ఉండే భావనలకు ప్రతీక అని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.

---------------------------

ఎస్సీ వర్గీకరణ అంశంపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికపై అధ్యయనానికి ఐదుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, హెూంమంత్రి వంగలపూడి అనిత, రహదారులు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్‌ను సభ్యులుగా నియమించింది. కన్వీనర్‌గా సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి వ్యవహరిస్తారు.

---------------------------

రాష్ట్రంలో మహిళల భద్రతకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యమిస్తోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. మంగళగిరిలో నిన్న నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకూ ఉన్న ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ స్థానంలో ఐజీ నేతృత్వంలో ఉమెన్ ప్రొటెక్షన్ వింగ్ ఏర్పాటు చేశామన్నారు. 164 శక్తి బృందాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తప్పిపోయిన పిల్లల గురించీ శక్తి యాప్ ద్వారా పోలీసులకి ఫిర్యాదు చేయవచ్చున్నారు. 26 జిల్లాల్లో సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని డీజీపి చెబుతూ...

..వాయిస్.. 34 సెకన్లు....

---------------------------

ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. రాష్ట్రంలో క్యాన్సర్ నివారణతో పాటు క్యాన్సర్ చికిత్సను ప్రజలకు చౌకగా అందుబాటులోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి ఆయన సలహాలిస్తారు. ఆ మేరకు ఆయన కేబినెట్ హెూదాలో సలహాదారుగా కొనసాగుతారని పేర్కొంటూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

ఇంటర్మీడియట్ విద్యలో ప్రభుత్వం కీలక సంస్కరణలు ప్రవేశపెడుతోందని ఇంటర్మీడియట్ విద్యా మండలి తెలిపింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇవి అమల్లోకి రాబోతున్నాయి. ఈ అంశంపై నిన్న మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఇంటర్ బోర్డు సమావేశం జరిగింది. ఇంటర్మీడియట్‌లో ఇక నుంచి విద్యార్థులు ఎం.బైపీసీ చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గణితంలో ఏ,బీ పేపర్లు రద్దు చేసి..ఇకపై వంద మార్కులకు ఒకటే పరీక్ష నిర్వహిస్తారు. సైన్స్ సబ్జెక్టుల్లో మార్కులను 60 నుంచి 85కు

పెంచారు. ఏటా ఫిబ్రవరిలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా పలు కీలక సంస్కరణలకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆమోదం తెలిపింది.

---------------------------

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో కఠిన శిక్షలు విధించేందుకు వీలుగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టం ఉందని విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జి.వి సరిత తెలిపారు. ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మహిళా భద్రత గురించి విజయవాడలోని ఏపీఎస్ ఆర్టీసీ సమావేశ మందిరంలో నిన్న నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ …నూతన నేర చట్టాలలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో సత్వర న్యాయం కల్పించేలా ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. ఇటువంటి వార్తలను విలేఖరులు ఎలా రాయాలనే అంశంపై పలు సూచనలు చేస్తూ…

..వాయిస్ ..34 సెకన్లు….

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్–వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా–వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. "క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

..ప్రోమో…

---------------------------

రాష్ట్రంలో పాఠశాలలకు రేపటి నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల 45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు విద్యాసంస్థలు కొనసాగుతాయి. పదోతరగతి పరీక్ష కేంద్రాలున్న బడుల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంటా 15 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

=====================